## ఎంపీగా నామాను గెలిపించుకోవాలి : జడ్పీ చైర్మన్ కమల్‌రాజు



వృద్ధుడిని ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

ముదిగొండ, మే 10 : జిల్లా సమస్యల గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించే నామాను ఎంపీగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని జడ్పీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జ్ లింగాల్ కమల్‌రాజు అన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం వల్లభి, కమలాపురం గ్రామాల్లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ తెలంగాణ బిల్లుపై తొలి సంతకం చేసింది నామా అని, మరోసారి ఆయనను గెలిపిస్తే మీ తరపున పోరాడుతారని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు తెచ్చారని, ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు వెచ్చించారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తిని మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని, ఆ బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, నాయకులు పోట్ల రవి, బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై పోరాడిన వ్యక్తిని నేను..

- మళ్లీ గెలిపిస్తే రైతాంగం పక్షాన పార్లమెంట్‌లో గళం వినిపిస్తా..
- తెలంగాణ అస్తిత్వాన్ని, ఆస్తిని కాపాడేది బీఆర్ఎస్ ఎంపీలే..
- కల్లూరు రోడ్ షోలో ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
- హామీలతో మోసం చేసిన కాంగ్రెస్ : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర
- పంటలను కాపాడిన ఘనత కేసీఆర్‌దే : మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



కల్లూరు మండల కేంద్రంలోని రింగ్ సెంటర్‌లో జనసమూహం , మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

పెనుబల్లి, మే 10 : తెలంగాణ రైతాంగ సమస్యలపై పార్లమెంట్‌లో గొంతెత్తి నిలదీశానని, మళ్లీ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండల కేంద్రంలో వేలాది మందితో రోడ్ షో నిర్వహించడంలో అంతా గులాబీమయం అయ్యింది. రోడ్ షోలో నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ కల్లూరులో ఓటు గుద్దితే ఢిల్లీలో పార్లమెంట్ దద్దరిల్లాలన్నారు. మండల ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా నాపై ఉంటాయని, మరోమారు మీ బిడ్డపై అభిమానం చూపి కారు గుర్తుపై ఓటు వేయాలన్నారు. భవిష్యత్‌లో దేశ రాజకీయాల్లో తెలంగాణ ఎంపీలు కీలకమని, తెలంగాణ అస్తిత్వాన్ని, తెలంగాణ ఆస్తిని కాపాడేది బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమేనని అన్నారు. రోడ్ షోకు తరలివచ్చిన ఆనందంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఈ నెల 13న ప్రతి వ్యక్తి కారు గుర్తుపై ఓటు వేసేలా చూడాలని నామా విజ్ఞప్తి చేశారు.

### హామీలతో మోసం చేసిన కాంగ్రెస్ : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర



అన్ని వర్గాలకు అండగా నిలిచింది గత కేసీఆర్ ప్రభుత్వమేనని, కానీ.. అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు చెప్పిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ మెడలు వంచాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఒకసారి మోసపోయాం.. ఇక మోసపోం.. కేసీఆర్‌కు అండగా ఉంటామని రోడ్ షోకు భారీ ఎత్తున తరలిరావడమే నిదర్శనమన్నారు. ఆయనకు అండగా నిలబడాలంటే 13న జరిగే ఓటింగ్‌లో ఒకటో నెంబర్ కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

### పంటలను కాపాడిన ఘనత కేసీఆర్‌దే : మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



మండలంలో ఎన్నెస్పీ జలాలు కింద పండే పంటలకు నీళ్లు లేక ఎండిపోతుంటే.. నీళ్లు తెప్పించి పంటలను కాపాడిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదేనని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గుర్తు చేశారు. కల్లూరు ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, క్రీడా ప్రాంగణం, నూతన హాస్పిటల్ భవనం, కొత్త బస్టాండ్, బ్రిడ్జిలు, రోడ్ల నిర్మాణం ఇలా కళ్ల ముందు కనిపించే అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేసేలా నీతి నిజాయితీగా అభివృద్ధి చేసిన ఘనత మనదేనన్నారు. కాగా.. రోడ్ షోకు హాజరైన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు రామారావు, ఎంపీపీ బీరెల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటంనేని వెంకటేశ్వరరావు, నాయకులు పెడకంటి రామకృష్ణ, కమిలీ, వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, నర్వనేని అంజయ్య, రాచమళ్ల నాగేశ్వరరావు, కొరకొప్పుల ప్రసాద్, సీహెచ్.కిరణ్, దేవరపల్లి నాగప్రసాద్, మేకల కృష్ణ, భాస్కర్‌రావు, ఒబ్బన వెంకటరత్నం, దార్ల నరసింహారావు, కంభంపాటి పుల్లారావు, రమేశ్, బొల్లం వెంకటేశ్వరరావు, అజ్మీరా జమలయ్య, బానోతు కృష్ణ, సయ్యద్ రవూఫ్, ఇతిహాజ్, నవాబ్ పాల్గొన్నారు.

## 'నామా'కు భారీ మెజార్టీ ఇవ్వండి

- ఐదు నెలల్లోనే అరిగోస పెడుతున్న కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పండి
- కాలయాపనే తప్ప పథకాలిచ్చే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు
- ఖమ్మం నగరంలోని డివిజన్ల రోడ్‌షోలో మాజీ మంత్రి అజయ్



ఖమ్మం రోడ్‌షోకు భారీగా హాజరైన ప్రజలు, మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, మే 10: ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు భారీ మెజార్టీ అందించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. అలాగే, ఐదు నెలల్లోనే అరిగోస పెడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కారణాలు చెబుతూ కాలయాపన చేయడమే తప్ప ఇచ్చిన మాట ప్రకారం పథకాలు ఇచ్చే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయం కోసం ఖమ్మం వన్‌టౌన్, త్రీటౌన్ ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలలో ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల అలుపెరగని పోరాటంతో ఉద్యమసారథి తెలంగాణను సాధించారని, ముఖ్యమంత్రిగా పదేళ్లలో స్వరాష్ట్రాన్ని తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కానీ తప్పుడు హామీలతో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అటకెక్కించిందని విమర్శించారు. ఇన్ని రోజులైనా పింఛన్లు పెంచలేదని, రూ.500కే గ్యాస్ ఇవ్వలేదని దుయ్యబట్టారు. అన్ని హామీలనూ అలాగే వదిలేశారని విమర్శించారు. 'నిత్యం కరెంటు పోవడం, తాగునీరు రాకపోవడం వాస్తవం కాదా?' అంటూ సభికులను ప్రశ్నించారు. దీంతో వారంతా 'అవును.. కరెంటో పోతోంది. నీళ్లు సరిగా రావట్లేదు..' అంటూ సమాధానమిచ్చారు. అలాగే, గోళ్లపాడు కాలువను రూ.70 కోట్లతో అభివృద్ధి చేస్తే రూ.170 కోట్లంటూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేశారని అన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే ఈ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆర్‌జేసీ కృష్ణ, లక్ష్మీ ప్రసన్న, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, కొత్తా వెంకటేశ్వర్లు, కర్నాటి కృష్ణ, పసుమర్తి రామ్మోహన్, మక్బూల్, దాదే అమృతమ్మ, తోట ఉమారాణి, కన్నం వైష్ణవి, మక్బూల్, పల్లా రోజ్‌లీనా, మాటేటి నాగేశ్వరరావు, తోట రామారావు, గడ్డం త్రిలోక్, సాయికిరణ్, రుద్రగాని ఉపేందర్, తోట వీరభద్రం, రవినాయక్, బండారు శ్రీనివాస్, తోగారు భాస్కర్, పారా ఉదయ్, షకీనా, గౌతమ్ బాబా, గార్లపాటి సంతోశ్, గోళ్ల వెంకట్, తౌసిఫ్ (బాబా) తదితరులు పాల్గొన్నారు.

## నామాను గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం..

- నా రాజకీయం పాలేరు బిడ్డల అభివృద్ధి కోసమే..
- మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి
- కేసీఆర్‌తోనే ఆకుపచ్చ పాలేరు : ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

ఖమ్మం రూరల్, మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తుకు ఓటేయాలనే స్పష్టతతో ప్రజలు ఉన్నారని, భారీ మెజార్టీతో నామాను గెలిపించుకొని కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సాయిగణేశ్‌నగర్‌లో గల కందాల క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కందాల మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు నేను చేస్తున్న రాజకీయం నా కోసం కాదని, పాలేరు బిడ్డల భవిష్యత్, ఈ ప్రాంత అభివృద్ధి కోసమేనని అన్నారు. అయితే మూడు నెలల కాలంలోనే పాలేరు ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తిగా అవగాహన కలిగిందన్నారు. పక్షం రోజులుగా ఏ ఊరు వెళ్లినా ప్రజలు మరోసారి మోసపోమని బాధతో చెబుతున్నారన్నారు. ప్రజల వైపు ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈసారి కారు గుర్తుకు ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని ఆయన కోరారు.

### కేసీఆర్‌తోనే ఆకుపచ్చ పాలేరు : ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్

గత కేసీఆర్ పాలనలోనే ఆకుపచ్చ నియోజకవర్గంగా పాలేరు తయారైందని ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. పదేళ్ల కాలంలో భక్తరామదాసు ప్రాజెక్టు, చెరువుల పూడికతీత, ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు. 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబీమా, రైతుబంధు ఇలా అనేక పథకాలతో ఆదుకున్నామన్నారు. ఈసారి పాలేరులో కారు గుర్తుకు ఓటేసి ప్రభంజనం సృష్టించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీ జీవన్‌కుమార్, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, టీపాలెం మండలాల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, బాషబోయిన వీరన్న, వేముల వీరయ్య, నాయకులు యండపల్లి వరప్రసాద్, ఇంటూరి శేఖర్, గూడ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మీ ఇంటి ఆడబిడ్డగా పోరాడుతా..

- రైతు రుణమాఫీపై కాంగ్రెస్ వాయిదాల పర్వం
- సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే..
- కార్నర్ మీటింగ్‌లో మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత



మాట్లాడుతున్న మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత, పక్కన బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరు టౌన్, మే 10 : పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా మళ్లీ గెలిపిస్తే జిల్లా సమస్యలపై మీ ఇంటి ఆడబిడ్డగా పోరాడుతానని మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత హామీ ఇచ్చారు. కాంగ్రెస్ 420 హామీలను నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు చెంపలు వేసుకుంటున్నారని, డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ఆగస్టుకు వాయిదా వేసిందన్నారు. శుక్రవారం మణుగూరు పట్టణంలో బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌కు మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావుతో కలిసి హాజరై ఆమె మాట్లాడారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు, కారుణ్య నియామకాల పేరుతో పునరుద్ధరణ చేసింది కేసీఆర్ మాత్రమేనని గుర్తు చేశారు. 100 రోజుల్లో గ్యారెంటీలన్నీ అమలు చేశామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏ గ్యారెంటీ అమలు చేయలేదని, దీనిని ప్రజలు గుర్తించాలన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందుకున్న వారు తమ ఇంటి ఆడబిడ్డలా ఆదరిస్తున్నారన్నారు. పినపాక నియోజకవర్గంలో వరదల సమయంలో నిత్యావసరాలు పంపిణీ చేశానని ఆమె గుర్తు చేశారు. ఈ ప్రాంతానికి కష్టం వచ్చిందంటే నాకు వచ్చినట్లుగా భావించి మీ ఇంటి ఆడబిడ్డగా పోరాడానన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో ఎన్నో కుటుంబాలను ఆదుకున్నారన్నారు. కష్టకాలంలో పినపాక నియోజకవర్గ ప్రజలను ఆదుకున్న తనకు ఓటు వేసి అబద్ధపు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రశ్నించే గొంతుకనై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ముక్కు పిండి ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోశం నర్సింహారావు, అడపా అప్పారావు, కోలేటి భవానీ శంకర్, బొలిశెట్టి నవీన్, యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు, ముత్యం బాబు, గాజుల రమ్య, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా.. పకడ్బందీగా..

- పోలింగ్ శాతం పెంచేలా అవగాహన సదస్సులు
- ఇప్పటికే స్ట్రాంగ్ రూములకు చేరిన ఈవీఎంలు
- 12నే కేంద్రాలకు చేరుకోనున్న ఎన్నికల సిబ్బంది
- రాజకీయ నేతల ప్రచారాలపై అబ్జర్వర్ల ప్రత్యేక నిఘా
- క్రిటికల్ కేంద్రాల వద్ద భద్రతా బలగాల మోహరింపు





ప్రశాంత ఎన్నికల కోసం పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ (ఫైల్)

భద్రాద్రి కొత్తగూడెం, మే 10 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు భద్రాద్రి జిల్లా అధికార యంత్రాంగం పక్కాగా, పకడ్బందీగా ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఎండలు మండిపోతున్నప్పటికీ అధికారులు వాయువేగంతో పనిచేస్తూ ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి, మూడు మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోకి వెళ్లాయి. దీంతో కలెక్టర్ ప్రియాంక నేతృత్వంలో అధికారులు సమాంతర వేగంతో పని చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్‌ను పూర్తి చేసేందుకు సిబ్బందికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నందున వారు పూర్తిస్థాయిలో హాజరై తమ ఓటు వినియోగించుకునేందుకు చర్యలు చేపట్టారు. ఎస్పీ రోహిత్‌రాజు సైతం క్రిటికల్ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రాచలం ఏజెన్సీలో మావోయిస్టుల ప్రభావం ఉండడంతో ఆయా ప్రాంతాల్లో గట్టి నిఘా పెట్టారు. 169 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటి వద్ద భద్రతా బలగాలను మోహరింపజేస్తున్నారు.

### పోలింగ్ శాతం పెంచేలా..

జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు కలెక్టర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. 18 ఏళ్లు దాటిన వారు ఓటు హక్కు పొందాలని, దానిని వినియోగించుకోవాలని సూచిస్తూ జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొండరెడ్ల గ్రామాలకూ వెళ్లి ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. జిల్లావ్యాప్తంగా 1,105 పోలింగ్ కేంద్రాల్లో మహిళలకు 172, దివ్యాంగులకు 161, యువతకు 151 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరో 138 మోడల్ పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేశారు. ఇప్పటికే హోం ఓటింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు.





మహిళా ఓటర్లను చైతన్యం చేసేందుకు వారితో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ (ఫైల్)

### 12నే కేంద్రాలకు సిబ్బంది..

ఈ నెల 13 జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఈ నెల 12న సాయంత్రానికే వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. 1,163 మంది పీవోలు, 1,163 మంది ఏపీవోలు, 2,326 మంది ఓపీవోలు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకొని సిద్ధంగా ఉన్నారు. 2,250 మంది పోలీసులు కూడా ఎన్నికల విధులకు రెడీగా ఉన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏఆర్‌వోలు తమ వద్దకు చేరిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. 1,385 బ్యాలెట్ యూనిట్లు, 1,385 కంట్రోల్ యూనిట్లు, 1,551 వీవీ ప్యాటెట్లు ఆయా కేంద్రాలకు చేరుకున్నాయి.

### ప్రచారాలపై ప్రత్యేక నిఘా..

ఒక వైపు ఎన్నికల ఏర్పాట్లు జరుగుతుండగానే.. మరో వైపు రాజకీయ నాయకుల ప్రచారాలపై ఎన్నికల పరిశీలకులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఎన్నికల వ్యయాన్ని పరిశీలిస్తున్నారు. 'ప్రచార వాహనాలను ఏ సమయానికి నిలిపివేస్తున్నారు? ప్రచారం ఏ సమయానికి ముగిస్తున్నారు?' వంటి అంశాలను గమనిస్తున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు, జెండాలను వెంటనే తొలగిస్తున్నారు. పరిమితికి మించి జనాలను తరలించినా స్క్వాడ్ బృందాలు పరిశీలిస్తున్నాయి.

### పోలింగ్ కేంద్రాల్లో పక్కాగా సౌకర్యాలు..

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన సౌకర్యాలన్నీ అధికారులు ఏర్పాటు చేశారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అన్ని పోలింగ్ కేంద్రాల్లోని వసతులు, సౌకర్యాలను పరిశీలించారు.

### సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్..



జిల్లాలో ప్రశాంత ఎన్నికల కోసం పక్కాగా ఏర్పాట్లు చేశాం. ఈవీఎంలు స్ట్రాంగ్ రూములకు తరలించాం. ఈవీఎంల కమిషనింగ్ పూర్తయింది. అన్ని విభాగాల సిబ్బందికి శిక్షణ ఇచ్చాం. దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా మహిళలు పూర్తిస్థాయిలో ఓటును వినియోగించుకునేలా అవగాహన కల్పించాం. కానీ.. భద్రాద్రి జిల్లాలో ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకే పోలింగ్ ఉంటుంది.

–డాక్టర్ ప్రియాంక, భద్రాద్రి కలెక్టర్

# ప్రచారానికి నేడు తెర

- లోక్‌సభ ఎన్నికలకు సర్వసన్నద్ధంగా జిల్లా అధికారులు
- 1,896 కేంద్రాల్లో 16 లక్షల మంది ఓటర్ల ఏర్పాట్లు
- వందశాతం పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల అమరిక
- ఎన్నికల విధుల్లో 9 వేల మంది అధికారులు, సిబ్బంది



ఖమ్మం, మే 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రంతో ముగియనుంది. ఈసీ మార్గదర్శకాల మేరకు జిల్లా అధికారులు ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వసన్నద్ధమవుతున్నారు. షెడ్యూల్ ప్రకారం నాలుగో విడతతో ఈ నెల 13న పోలింగ్‌కు సంసిద్ధమవుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలున్నా యి. అందులో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 3 నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య పెరగడంతో ఆ పెరిగిన ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులను ఏర్పాటు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసే దివ్యాంగులకు, 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించగా అర్హులు అప్పటికే దానిని వినియోగించుకున్నారు. ఇక నిఘా కోసం 22 ఎఫ్ఎస్టీ, 21 ఎస్ఎస్టీ, 37 ఎంసీసీ బృందాలు పనిచేస్తున్నాయి. 203 మంది సెక్టార్ అధికారులు విధుల్లో ఉన్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ప్రలోభాల నియంత్రణకు అధికార యంత్రాం గం పటిష్ట చర్యలు తీసుకుంటోంది. 2 ఇంటిగ్రేటెడ్ ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు,10 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు, 8 ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు ఏర్పాటు చేసి వాటి ద్వారా 24 గంటలూ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

### 'ఖమ్మం' బరిలో 35 మంది..

ఖమ్మం పార్లమెంట్ స్థానం బరిలో 35 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో నలుగురు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులు. మిగతా 31 మంది అభ్యర్థులు వివిధ రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు, ఏ పార్టీలతో సంబంధం లేని స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 1,084 లోకేషన్లలో 1,896 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 7,584 మంది ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపీవో అధికారులు విధులు నిర్వహించనున్నారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. 103 లోకేషన్లలో 230 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. పోలింగ్ కేంద్రాల లోపల వంద శాతం సీసీ కెమెరాలు అమర్చి ఉంచారు. పోలీస్ శాఖ సూచనల ప్రకారం అవసరమున్న అన్ని పోలింగ్ కేంద్రాల వెలుపల కూడా సీసీ కెమెరాలను అమర్చారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 355, పాలేరులో 290, మధిరలో 268, వైరాలో 216, సత్తుపల్లిలో 294, కొత్తగూడెంలో 253, అశ్వారావుపేటలో 184 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ర్యాండమైజేషన్ పూర్తి చేసిన ఈవీఎంలను కేటాయించి వాటిని స్ట్రాంగ్ రూములకు తరలించారు. ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో మొత్తం 16,31,039 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 7,87,160 మంది పురుషులు, 8,43,749 మంది మహిళలు,130 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. కాగా, ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తయినప్పటికీ.. అవి అందని ఓటర్లు కూడా ఈసీ సూచించిన ఏదైనా గుర్తింపు కార్డును చూపి ఓటు వేయొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

### నియోజకవర్గాల వారీగా వివరాలు ఇలా..

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | లోకేషన్స్ | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జెండర్స్ | మొత్తం |
|---|---|---|---|---|---|---|
| ఖమ్మం | 355 | 134 | 155284 | 168740 | 49 | 324073 |
| పాలేరు | 290 | 190 | 115717 | 125081 | 08 | 240806 |
| మధిర | 268 | 152 | 107111 | 115039 | 10 | 222160 |
| వైరా | 252 | 181 | 93700 | 99683 | 06 | 193389 |
| సత్తుపల్లి | 294 | 164 | 118490 | 125441 | 12 | 243943 |
| కొత్తగూడెం | 253 | 139 | 119477 | 127979 | 38 | 247494 |
| అశ్వారావుపేట | 184 | 124 | 77381 | 81786 | 07 | 159174 |
| మొత్తం | 1896 | 1084 | 787160 | 843749 | 130 | 1,631,039 |